క్లుప్తంగా

జైపాల్‌రెడ్డికి నివాళి



జైపాల్‌రెడ్డి స్మారకం వద్ద పూలతో నివాళులర్పిస్తున్న ఏనుగు జంగారెడ్డి

కందుకూరు: కేంద్ర మాజీ మంత్రి స్వర్గీయ జైపాల్‌రెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని సోమవారం హైదరాబాద్‌లోని స్ఫూర్తి స్థల్ వద్ద పీసీసీ ప్రధాన కార్యదర్శి ఏనుగు జంగారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఐ.రాకేశ్‌గౌడ్ తదితరులు ఘనంగా నివాళులర్పించారు. తెలంగాణకు జైపాల్‌రెడ్డి చేసిన సేవలను కొనియాడారు. రాష్ట్ర ప్రజలు ఆయనకు రుణపడి ఉన్నారన్నారు. వారి వెంట కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

కార్పొరేటర్లపై చర్యలు తీసుకోవాలని వినతి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకుడు సుభాన్‌యాదవ్

బడంగ్‌పేట్: మున్సిపల్‌లో కార్పొరేటర్ల పదవీ కాలం దాటి ఆరునెలలు గడిచినా ఇంకా కార్లపై వారి పేరుతో ఉన్న నంబర్ ప్లేట్లను అలాగే ఉంచారని, ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న అలాంటి వాటిని గుర్తించి తొలగించాలని కోరుతూ.. సోమవారం మహేశ్వరం నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వల్లపు సుభాన్ యాదవ్ కమిషనర్ సరస్వతికి విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్లకు ఉన్న కార్పొరేటర్ అనే నంబర్ ప్లేట్లను తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అన్ని డివిజన్ల కార్పొరేటర్లపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ గోవర్ధన్‌రెడ్డి, సామ వరుణ్‌రెడ్డి, సరసమ్మ, భాస్కర్, వెంకటేశ్, శివ, నర్సింగ్, మహేశ్ తదితరులు ఉన్నారు.

ప్రజావాణిలో నాలుగు ఫిర్యాదులు



ప్రజావాణి కార్యక్రమంలో డీసీ, ఇతర అధికారులు

ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ జోన్ పరిధిలోని ఐదు సర్కిల్ కార్యాలయాలు, ఒక జోనల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ప్రజావాణికి నాలుగు ఫిర్యాదులు మాత్రమే వచ్చాయని అధికారులు తెలిపారు. కాప్రా సర్కిల్ పరిధిలో ఇంజినీరింగ్ విభాగంపై ఒక ఫిర్యాదు. ఉప్పల్ సర్కిల్ పరిధిలో ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ విభాగాలపై ఒక్కొక్క ఫిర్యాదు. హయత్‌నగర్ సర్కిల్ పరిధిలో ఇంజినీరింగ్ విభాగంపై ఒక్క ఫిర్యాదు వచ్చినట్లు పేర్కొన్నారు. సరూర్‌నగర్ సర్కిల్, ఎల్‌బీనగర్ సర్కిల్, ఎల్‌బీనగర్ జోనల్ కార్యాలయంలో ప్రజావాణికి ఒక్క ఫిర్యాదు కూడా దాఖలు కాలేదు.

నూతన కమిటీ ఎన్నిక

మన్సూరాబాద్: తెలంగాణ స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ రంగారెడ్డి జిల్లా సమావేశం ఎల్‌బీనగర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పి.సోమిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా గోపికృష్ణ, కోశాధికారిగా రాంరెడ్డి, ఉపాధ్యక్షులుగా వెంకట్‌రెడ్డి, కొమురయ్య, జాయింట్ సెక్రటరీలుగా శ్రీనివాస్, నర్సింహమూర్తి, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా సత్యనారాయణరెడ్డి, కార్యవర్గ సభ్యులుగా మోహన్‌రెడ్డి, మధనాచారి, రమేష్‌రెడ్డి ఎన్నికైనట్లు నూతన అధ్యక్షుడు సోమిరెడ్డి తెలిపారు.

'హైవేలపై వాహనాలు పార్కు చేయొద్దు'

హస్తినాపురం: జాతీయ రహదారులపై వాహనాలను పార్కు చేస్తే చర్యలు తీసుకుంటామని వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ మహేష్ హెచ్చరించారు. జాతీయ రహదారి ఆటోనగర్ వద్ద అజాగ్రత్తగా పార్కు చేసిన 12 మంది లారీ డ్రైవర్లపై కేసులు నమోదు చేసి వారికి ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ..జాతీయ రహదారిపై వాహనాలను పార్క్ చేయడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగి అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని వివరించారు. వాహనాల డ్రైవర్లు తమ వాహనాలను పార్కింగ్ స్థలంలో పార్కు చేసుకోని ప్రమాదాలు తగ్గుతాయని సూచించారు.

సొంతింటి కల సాకారం

- మండలంలో మొత్తం 1054 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు
- పనులు చేపడుతున్న వారికి విడతల వారీగా డబ్బులు జమ
- ఆనందం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు
- నిర్మాణాలకు కొంతమంది వెనుకడుగు



పెద్దమ్మతండాలో నిర్మాణమవుతున్న ఇందిరమ్మ ఇల్లు

మహేశ్వరం: ప్రతీ నిరుపేదకు సొంతింటి కల ఉండాలన్నది ఓ కల. ప్రస్తుత ప్రస్తుత పరిస్థితుల్లో పేద, మధ్య తరగతి ప్రజలకు ఇంటి నిర్మాణం తలకు మించిన భారమనే చెప్పవచ్చు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసి పేదల కలను సాకారం చేసేలా ఇందిరమ్మ ఇళ్ల పథకానికి శ్రీకారం చుట్టింది. ఈ పథకంలో భాగంగా రూ.5లక్షలతో అర్హులకు ఇళ్లు మంజూరు చేసింది. దీంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మొదటి విడతలో..

మండలంలోని 30 గ్రామ పంచాయతీలలో పెద్దమ్మ తండాను పైలట్ ప్రాజెక్టుగా తీసుకొని ప్రభుత్వం 41 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసింది. అందులో 13 మంది ఇళ్లు నిర్మించుకుంటున్నారు, ఐదు మంది స్లాబులు పోసి, గోడల నిర్మాణం చేపట్టి, ప్లాస్టరింగ్ చేసుకుంటున్నారు. మరో ఐదుగురు ఇళ్ల నిర్మాణానికి ముగ్గులు పోసి వదిలేశారు త్వరలో పనులు ప్రారంభిస్తామంటున్నారు. 25 మంది లబ్ధిదారులు వివిధ కారణాలతో తాము ఇందిరమ్మ ఇళ్లను నిర్మాణం చేసుకోలేమని మంజురైన ఇళ్లను రద్దు చేయాలని ఇందిరమ్మ కమిటీకి లిఖితపూర్వకంగా రాసిచ్చారు.

రెండవ విడతలో..

మండలంలోని 30 గ్రామ పంచాయతీలలో పైలట్ ప్రాజెక్టు కింద ఎంపికైన గ్రామం పెద్దమ్మ తండాను వదిలేసి 29 గ్రామ పంచాయతీలకు 1013 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. అందులో 272 మంది లబ్ధిదారులు బేస్‌మెంట్ నిర్మాణం పూర్తి చేశారు. 518 మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణానికి ముగ్గులు పోసి పనులు ప్రారంభించారు. 295 మంది లబ్ధిదారులు వివిధ కారణాలతో తాము ఇందిరమ్మ ఇళ్లను నిర్మాణం చేసుకోలేకపోతున్నామని, ఆయా గ్రామాల ఇందిరమ్మ కమిటీకి లిఖిత పూర్వకంగా లేఖ రాసి ఇచ్చారు. ఇంకా సుమారు 200 మంది లబ్ధిదారులు ఇంకా పనులు ప్రారంభించలేదు. బేస్‌మెంట్ నిర్మాణం పూర్తయిన 132 మంది లబ్ధిదారులకు వారి అకౌంట్లో లక్ష రూపాయాలు జమయ్యాయి. మరి కొంతమంది లబ్ధిదారులు తమకు ఇళ్లను మంజూరు చేయాలని అధికారులను కోరుతున్నారు.

రూ.2లక్షలు జమయ్యాయి



ఇళ్లు కట్టుకోవడం కోసం గత ప్రభుత్వంలో దరఖాస్తు చేసుకున్నా రాలేదు. కాంగ్రెస్ ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోవడంతో పైలట్ ప్రాజెక్టు కింద ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశారు. 90 శాతం ఇంటి నిర్మాణం పనులు పూర్తయ్యాయి. తనకు ఇప్పటివరకు రూ.2లక్షలు అకౌంట్లో జమయ్యాయి. స్లాబ్, ప్లాస్టరింగ్ పనులు పూర్తి చేసినట్లు అధికారులు ఫొటోలు తీసుకెళ్లారు. త్వరలో డబ్బులు జమ అవుతాయంటున్నారు.

– నేనావత్ స్వప్న,లబ్ధిదారురాలు,పెద్దమ్మ తండా

సంతోషంగా ఉంది



ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కావడంతో సంతోషంగా ఉంది. ప్రస్తుతం ఇళ్ల నిర్మాణ పనులు చేస్తున్నాం. బేస్‌మెంట్ నిర్మాణం పూర్తి కావడంతో లక్ష రూపాయలు తమ అకౌంట్లో జమయ్యాయి. ఇదివరకు ఇళ్లు లేక ఇబ్బందులు పడేవాళ్లం. మా సొంతింటి కల నెరవేరనుంది. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎప్పటికీ రుణపడి ఉంటాను.

– అదిరాల సూజాత, లబ్ధిదారురాలు, గంగారం

ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్నాం



మండలంలోని 30 గ్రామ పంచాయతీల్లో మొదటి విడత, రెండో విడత కలిపి 1054 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. అందులో 272 మంది బేస్‌మెంట్ వరకు ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి చేశారు. 518 మంది ముగ్గు పోశారు. ఇంకా 200 మంది పనులు ప్రారంభించలేదు. 295 మంది తాము ఇళ్లను నిర్మాణం చేసుకోలేమని లిఖిత పూర్వకంగా రాసిచ్చారు. ప్రస్తుతం ఇళ్ల నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. పూర్తయిన పనులను ఫొటోలతో ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్నాం.

– శైలజ,ఎంపీడీఓ, మహేశ్వరం.

ప్రభుత్వాలు మారినా సంక్షేమం ఆగొద్దు

మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి



రేషన్‌కార్డులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి

బడంగ్‌పేట్: ప్రభుత్వాలు మారిన సంక్షేమం ఆగకూడదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. సోమవారం బాలాపూర్ మండల కార్యాలయం ఆధ్వర్యంలో కొత్త రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని బడంగ్‌పేట్‌లోని ప్రజాభవన్ ఫంక్షన్‌హాలులో చేపట్టారు. కార్పొరేషన్‌లో 1003, జల్‌పల్లి మున్సిపాలిటీలో 319 కలిపి మొత్తంగా 1,322 కార్డులు మంజూరు కాగా.. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యేతో పాటు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, టీయూఎఫ్‌ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి హాజరై లబ్ధిదారులకు కొత్త రేషన్‌కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఏ ప్రభుత్వాలు మారినా అర్హులైన పేదలకు సంక్షేమ ఫలాలు అందించే బాధ్యత ఉంటుందన్నారు.

రేషన్‌కార్డులు ఇచ్చి చూపించాం

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే అర్హులైన ప్రతీ పేదవారికి రేషన్‌కార్డులు ఇస్తామన్నా మాట నిలబెట్టుకున్నామని టీయూఎఫ్‌ఐడీసీ చైర్మన్ చల్ల నర్సింహారెడ్డి అన్నారు. అర్హులు ఎవరైనా మిగిలి ఉంటే న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి, కమిషనర్ పి.సరస్వతి, తహసీల్దార్ ఇందిరా దేవి, నయాబ్ తహసీల్దార్ మణిపాల్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు నవారు మల్లారెడ్డి, దిండు శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరలు కిలో రూపాయల్లో.. టమోటా రూ.43, వంకాయ రూ.23, బెండ రూ.45, పచ్చిమిర్చి రూ.60, కాకరకాయ రూ.26, బీరకాయ రూ.35, కాలిఫ్లవర్ రూ.18, క్యాబేజీ రూ.15, క్యారెట్ రూ.41, దొండ రూ.28, ఆలుగడ్డ రూ.23, ఉల్లిగడ్డ రూ.22, గోకరకాయ రూ.43, దోసకాయ రూ.13, సొరకాయ రూ.11, పొట్లకాయ రూ.18, అరటికాయ రూ.11, చిక్కుడుకాయ రూ.55, చామగడ్డ రూ.25, మునగ రూ.28, కందగడ్డ రూ.45, బీట్‌రూట్ రూ.28, కీర రూ.35, బీన్స్ రూ.60, క్యాప్సికమ్ రూ.55. ఈరోజు మంగళవారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

కాంగ్రెస్‌తోనే నిరుపేదలకు న్యాయం

మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్

తుక్కుగూడ: కాంగ్రెస్‌తోనే నిరుపేదలకు న్యాయం జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్ అన్నారు. సోమవారం పుర కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గ వ్యాప్తంగా అర్హులై, దరఖాస్తు చేసుకున్న ప్రతీ ఒక్కరికి నూతన రేషన్‌కార్డులను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఇందిరమ్మ కమిటీ సభ్యులు కొత్త రేషన్‌కార్డులను ఇంటింటా తిరిగి పంపిణీ చేయాలని ఆయన సూచించారు. బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో ఏ ఒక్కరికి రేషన్‌కార్డు మంజూరు చేయలేదన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏనుగు జంగారెడ్డి, పీసీసీ నాయకులు గోగికర్ జానకీరామ్, మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణానాయక్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మహాసభను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న ప్రభులింగం

చేవెళ్ల: సీపీఐ పార్టీ 17వ జిల్లా మహాసభను ఆగస్టు 2న మొయినాబాద్‌లో నిర్వహిస్తున్నామని, ఈ సభను పెద్దఎత్తున విజయవంతం చేయాలని జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.ప్రభులింగం పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో సోమవారం మండల అధ్యక్షుడు సత్తిరెడ్డి అధ్యక్షతన పార్టీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొయినాబాద్‌లోని అంజనాదేవి గార్డెన్‌లో ఆగస్టు 2న జరిగే 17వ జిల్లా మహాసభకు ముఖ్య అతిథులుగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గ సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి హాజరవుతున్నారన్నారు. ఈ మహాసభలో భవిష్యత్ పార్టీ నిర్మాణం, ప్రజాసంఘాల నిర్మాణం, పార్టీని ఎలా బలోపేతం చేయాలనే అంశాలతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ దిశగా నిర్ణయాలపై చర్చిస్తామన్నారు. సమావేశంలో ఏఐకేఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు బి.సుభాన్‌రెడ్డి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ, మక్బుల్, షారీలు, పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ కార్యదర్శి శ్రీకాంత్

షాద్‌నగర్: విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ కార్యదర్శి వడ్ల శ్రీకాంత్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అదేవిధంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను వారు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు మంచి పౌష్టిక విలువతో కూడిన ఆహారాన్ని అందించాలన్నారు. ఇటీవల ప్రభుత్వ హాస్టళ్లు, పాఠశాలలు, గురుకులాల్లో ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారన్నారన్నారు. ఆహార భద్రత ప్రమాణాలు సరిగా పాటించకపోవడంతో ఫుడ్‌పాయిజన్ అవుతోందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఆదిల్, కయ్యూం, ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి

మాజీ మేయర్ పారిజాత



డీఈఈ వెంకన్నతో కలిసి రోడ్డును పరిశీలిస్తున్న పారిజాత

బడంగ్‌పేట్: బాలాపూర్–బడంగ్‌పేట్ ఆర్‌సీఐ ప్రధాన రహదారి అధ్వానంగా మారిందని, వెంటనే మరమ్మతులు చేపట్టాలని మాజీ మేయర్ చిగురింత పారిజాత డీఈఈ వెంకన్నను కోరారు. సోమవారం 31వ డివిజన్‌లోని లక్ష్మీనగర్, శాంతినగర్ కాలనీల్లో ఆమె పర్యటించారు. డీఈఈతో కలిసి బడంగ్‌పేట్ టూ బాలాపూర్ రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాలనీల్లో నెలకొన్న రోడ్ల సమస్యలను త్వరలో పరిష్కరించాలన్నారు. అధ్వానంగా మారిన రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని కోరారు. ఏఈఈ హరీష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ యాదగిరి, వార్డు ఆఫీసర్లు శ్రీకాంత్, శ్రీనివాస్‌గుప్తా, గిరి ముదిరాజ్, శివకుమార్ పాల్గొన్నారు.

నిరుపేదల సంక్షేమమే ధ్యేయం

బడంగ్‌పేట్: నిరుపేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని మాజీ మేయర్ చిగురింత పారిజాత అన్నారు. ఆహార భద్రతకార్డుల(రేషన్ కార్డులు) ప్రక్రియ సోమవారం రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. గత 12 సంవత్సరాలల్లో ఎన్నడూ లేని విధంగా మొదటిసారి పెద్దఎత్తున రేషన్‌కార్డుల పంపిణీ చేస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీదేనన్నారు. లబ్ధిదారులకు సన్నబియ్యాన్ని అందిస్తూ ప్రజల్లో సంతోషాన్ని నింపిందన్నారు. ప్రజాసంక్షేమానికి సీఎంరేవంత్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు.

ఘనంగా పలహారం బండి ఊరేగింపు



ఊరేగింపులో పాల్గొన్న స్థానికులు

మీర్‌పేట: బోనాల ఉత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం మీర్‌పేట ఓల్డ్ విలేజ్‌లో అమ్మవారి పలహారం బండి ఊరేగింపు కార్యక్రమాన్ని కాలనీవాసులు ఘనంగా నిర్వహించారు. పలహారం బండిని వీధుల గుండా ఊరేగింపు చేపట్టి.. పోచమ్మ దేవాలయం వరకు తీసుకొచ్చి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు దాసరి బాబు, యాదయ్య, దాసరి రంజిత్, జీవన్, బొమ్మని యాదయ్య, దర్శన్ తదితరులు పాల్గొన్నారు.

బెల్టు షాపులపై చర్యలు తీసుకోవాలని వినతి

కందుకూరు: తమ గ్రామంలో బెల్టుషాపులు నిర్వహించకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ మండల పరిధిలోని లేమూరు గ్రామస్తులు సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో మద్యపాన నిషేధం జరిగేలా తమవంతు కృషి చేస్తున్నామన్నారు. అందులో భాగంగా మద్యం విక్రయించొద్దని బెల్టు షాపుల నిర్వాహకులకు చెప్పినా ఫలితం లేదన్నారు. ఎక్సైజ్ అధికారుల ద్వారా అమ్మకాలు జరగకుండా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు కోరుప్రోలు రాజాప్రతాప్‌రెడ్డి, మంచాల భాస్కర్, గుర్వి మహిపాల్, డప్పు మహేందర్, గంగరి నర్సింహ, గంగరి గణేష్, పులి వెంకటేశ్, డప్పు కరుణాకర్, మంచాల సంజీవ తదితరులు పాల్గొన్నారు.

శ్రీలతారెడ్డికి డాక్టరేట్

ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్‌కు చెందిన శ్రీలతారెడ్డి ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజినీరింగ్‌లో వీఎల్‌ఎస్‌ఐ ఆధారిత ద్విమితీయ పినైట్ ఇంపల్స్ రెస్పాన్స్ పిల్టర్ శిల్ప నిర్మాణం, పనితీరు విశ్లేషణ అనే పరిశోధన చేశారు. ఇందుకు గాను చెన్నైలోని ఎలక్ట్రానిక్స్, ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజినీరింగ్ కళాశాల నుంచి ఆమె (పీహెచ్‌డీ) డాక్టరేట్‌ను తీసుకున్నారు. చెన్నైలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆమెకు ఈ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. శ్రీలతారెడ్డి ప్రస్తుతం బీఎన్‌రెడ్డి సమీపంలోని సీవీఆర్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు.

రోడ్లు ఇలా.. ప్రయాణం సాగేదెలా?



సరస్వతీనగర్ కాలనీలోని కమాన్ వద్ద భారీగా ఏర్పడిన గుంత



మన్సూరాబాద్‌లోని గణేష్‌నగర్ రోడ్డు నెం-2లో..

- భారీ వర్షాలతో గుంతలమయంగా మారిన ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని రోడ్లు
- మరమ్మతులు మరిచిన సంబంధిత అధికారులు
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు, వాహనదారులు

ఎల్‌బీనగర్: ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లు కోతకు గురై అధ్వానంగా మారి గుంతలుగా ఉన్నాయి. వర్షం తగ్గినా గుంతలుగా మారిన రోడ్లకు మరమ్మతులు చేయకుండా ఇంజినీరింగ్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని పలు కాలనీలో ఉన్న ఇన్నర్ రోడ్లతో పాటు ప్రధాన రహదారలు కూడా గుంతలతో అధ్వానంగా తయారయ్యాయి. ఈ గుంతల రోడ్ల పైన వాహనాలు నడపాలంటే జేబులు గుల్లవుతున్నాయని పలువురు ఆందోళన చెందుతున్నారు. ఈ గుంతల్లో పడి వాహనాలు రిపేరుతో పాటు నడ్డి విరుగుతోందని పలువురు వాపోతున్నారు.

మరమ్మతుల పేరుతో ప్రజాధనం లూటి..

గతంలో వేసిన రోడ్లు అధ్వానంగా మారడంతో పాటు ఇటీవల కురుస్తున్న వర్షాలకు తోడు రోడ్లు అక్కడక్కడ కాలనీలో ధ్వసంమయ్యాయి. దీంతో ఇంజినీరింగ్ అధికారులు మరమ్మతుల పేరుతో కాంట్రాక్టర్లతో కుమ్మక్కై ప్రజాధనం లూటి చేస్తున్నారని సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు రోడ్లను నాసిరకంగా కాకుండా నాణ్యతతో కూడిన పనులు చేపట్టాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

కోతకు గురైన రోడ్లు ఇవే..

- సరస్వతీనగర్ కాలనీలోని కమాన్ వద్ద రోడ్డు కోతకు గురైనా మరమ్మతులు చేయడం లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు.
- కామినేని వైఎస్సాఆర్ చౌరస్తా వద్ద గుంతలుగా మారిన రోడ్డు. ఇబ్బందుల్లో వాహనదారులు.
- శ్రీరాంనగర్ కాలనీలో కొట్టుకుపోయిన రోడ్డు. వాహనదారు ఇబ్బందులు పడుతున్నారు.
- మన్సూరాబాద్ గణేష్‌నగర్ రోడ్డు నెం-2లో గుంతలుగా మారిన రోడ్డు వాహనదారులు ఈ గుంతలతో జేబులకు చిల్లు పడుతున్నాయని గగ్గోలుపెడుతున్నారు.
- చింతలకుంట వద్ద రోడ్డు కోతకు గురికావడంతో రోడ్లపైకి వాహనాలు తేవాలంటే భయాందోళన చెందుతున్నారు
- బీఎన్‌రెడ్డినగర్‌లోని గాంధీనగర్ కాలనీలకు వెళ్లే రోడ్డు పూర్తిగా అధ్వానంగా మారడంలో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మరమ్మతులు చేపట్టాలి..

కాలనీలకు వెళ్లే రోడ్డు పూర్తిగా గుంతలు పడి వాహనాలు వెళ్లలేని పరిస్థితి ఉంది. వర్షాలతో పాటు గతంలో రోడ్డు వేసిన కారణంగా మరమ్మతులు చేయకపోవడంతో రోడ్లు పూర్తిగా గుంతలమయంగా మారాయి. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి మరమ్మతులు చేపట్టాలి.

– సురేష్, బీఎన్‌రెడ్డినగర్)



కామినేని వైఎస్సాఆర్ చౌరస్తా వద్ద..



బీఎన్‌రెడ్డినగర్‌లోని గాంధీనగర్ కాలనీకి వెళ్లే రోడ్డు ఇలా..